సెంచూరియన్ లో ఓపెన్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర -నెల్లిమర్ల: సెంచూరియన్ విశ్వావిద్యాలయంలో ఓపెన్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 78 జట్లు వాలీబాల్, క్రికెట్, ఫుట్ బాల్, లాన్ టెన్నిస్ డబుల్స్‌లో తలపడ నున్నాయి. గురువారం నుంచి వాలీబాల్ పోటీలు మొదలయ్యాయి. ఈ పోటీలను ప్రారంభించిన వైస్ చాన్సెలర్ ప్రొఫెసర్ జీ ఎస్ ఎన్ రాజు మాట్లాడుతూ ఈ పోటీలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఓటమి కలిగినపుడు దానిని విజయానికి బాటలుగా మలచుకోవాలన్నారు. ఫుట్ బాల్, క్రికెట్ విజేత లకు ప్రథమ బహుమతి కింద ట్రోఫీ తో పాటు రూ.10వేలు నగదు బహుమతి, ద్వితీయ బహుమతి కింద రూ.5వేలు ప్రోత్సాహకాన్ని ఇస్తామన్నారు. లాన్ టెన్నిస్, వాలీబాల్ విజేత లకు ప్రథమ బహుమతి కింద రూ.5వేలు ద్వితీయ బహుమతి కింద రూ.2500 ప్రోత్సాహక బహుమతి ఉందన్నారు. వివిధ విభాగాలలో ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి ఎస్ వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్. ఎస్. వర్మ, స్పోర్ట్స్ డైరెక్టర్ నారాయణ రావు, డీన్ ప్రొఫెసర్ మురళి, హెచ్.ఆర్ మేనేజర్ శ్రీనివాస్ తో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలతో అనేక అనర్థాలు

స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సీఐ ఎస్.ధర్మారావు

విశాలాంధ్ర -శృంగవరపుకోట: యువత మద్యం, మాదకద్రవ్యాలు వంటి మత్తుపదార్థాలు సేవించడం వల్ల అనర్థాలు తలెత్తడంతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తి వారి కుటుంబాలు ఆర్థిక భారంతో కుంగిపోతాయని ఎస్.కోట స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సీఐ ఎస్. ధర్మారావు అన్నారు. ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు ఎస్.కోట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తుపదార్థాలు వల్ల కలిగే అనర్థాలపై ఎస్ఈబీ అధికారులు అవగాహన సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించడం వలన యువత భవిష్యత్తు నాశనం అవుతుందని హెచ్చరించారు. మీ గ్రామాల్లో మద్యం, సారా వంటివి అమ్మకాలు జరిగినా, గంజాయి, మద్యం వంటివి అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిసినా ఎస్ఈబీ, పోలీసు అధికారులు, సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. అవగాహన లో ఎస్.ఐ ఎన్. రమ్యశ్రీ, జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డుకు రైతుల భూములు తీసుకోవద్దు

పాటూరు రైతులు సచివాలయంలో వినతి

విశాలాంధ్ర-వేపాడ : జాతీయ రహదారి ఎన్ హెచ్ 516 బి, (బైపాస్ రోడ్డు) పేరుతో చిన్న సన్న కారు రైతుల భూములు లాక్కోవద్దంటూ పాటూరు రైతులు సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. మండలంలోని పాటూరు గ్రామానికి చెందిన రైతులు సిపిఐ జిల్లా రైతు సంఘం నాయకుడు డేగల అప్పలరాజు ఆధ్వర్యం లో పాటూరు సచివాలయానికి చేరుకుని బైపాస్ రోడ్డు పేరుతో నిరుపేదల భూములు లాకోవద్దని దీనివల్ల రైతుల పచ్చని పంట పొలాలు నష్టపోతామని అలాగే గ్రామాలు ఉన్నచోట రోడ్డు వెడల్పు చేయడంతో నిరుపేదల ఇల్లులు పోయి రోడ్డున పడతామని రైతులతో గ్రామస్తులతో సమావేశాలు ఏర్పాటు చేసిన తర్వాతే రోడ్డు పనులకు అనుమతులు ఇవ్వాలని ప్రస్తుతం ఉన్న రోడ్డును రెండు వైపులా విస్తరించాలని రోడ్డులో భూములు ఇల్లు కోల్పోయిన రైతులకు ప్రత్యామ్నాయ చూపించిన తర్వాతే రోడ్డుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డి.లక్ష్మీ,ఏ. సోములమ్మ, కె త్రిలక్ష్మి, పల్లి భారతి, జి. కళావతి,డి. లక్ష్మీ, ధీ. సుశీల, డి. వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నిర్దేశిత గడువులోగా నిర్మాణ పనులు పూర్తిచేయాలి

అవసరమైన కార్మికులు, నిర్మాణ సామాగ్రిని సమీకరించాలి

వైద్య కళాశాల పనులపై కలెక్టర్ ఆదేశాలు/ నిర్మాణం పనులు పరిశీలన

విశాలాంధ్ర-విజయనగరం: ప్రభుత్వ వైద్య కళాశాల భవనాల నిర్మాణంలో భాగంగా చేపట్టిన వివిధ రకాల నిర్మాణ పనులను, ఇంజనీరింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ వైద్య ఆరోగ్య ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నిర్మాణం పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన సిబ్బందిని, సామాగ్రిని సమీకరించాలని నిర్మాణ సంస్థకు సూచించారు. వైద్య కళాశాల నిర్మాణం పనుల పురోగతిని తెలుసుకునే నిమిత్తం జిల్లా కలెక్టర్ శ్రీమతి నాగలక్ష్మి గురువారం కళాశాలను సందర్శించారు. వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఎస్.ఇ. అంకమ్మ చౌదరి, ఇ.ఇ. బి.ఎన్.ప్రసాద్ జిల్లా కలెక్టర్‌కు నిర్మాణం పనులు జరుగుతున్న తీరును వివరించారు. కార్మికులు భవన నిర్మాణంలో ఎన్ని గంటలు పాల్గొంటున్నదీ కలెక్టర్ తెలుసుకున్నారు. పెయింటింగ్, తరగతి గదుల్లో సీట్ల ఏర్పాటు పనులు, సీలింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు వివరించారు. విద్యుదీకరణ, వైరింగ్, తాగునీటి పైప్‌లైన్లు, ఆడియో వీడియో పరికరాల ఏర్పాటు వంటి అంశాలపైన కలెక్టర్ తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు, హాస్టల్ బ్లాక్ ల నిర్మాణం గడువులోగా పూర్తిచేస్తామని ఎస్.ఇ., ఇ.ఇ.లు వివరించారు. ఈ సందర్భంగా పలు తరగతి గదుల్లో జరుగుతున్న ఫర్నిచర్ ఏర్పాటు, ల్యాబ్‌ల పనులను కలెక్టర్ పరిశీలించారు. కళాశాల వరకు రోడ్డు నిర్మాణంపై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు రూపొందిస్తున్నట్లు ఇ.ఇ. ప్రసాద్ తెలిపారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.పద్మలీల, వైద్య కళాశాలకు చెందిన పలువురు వైద్యులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

శరవేగంగా సిద్ధమవుతున్న వైద్య కళాశాల

ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం కానున్న తరుణంలో ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఒకవైపు గోడలకు పెయింటింగ్ పనులు, మరోవైపు భవనం లోపల అవసరమైన ఇంటీరియర్ పనులు నిరంతరాయంగా జరుగుతున్నాయి. జూలై 15వ తేదీ నాటికి పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో పెద్ద ఎత్తున భవన నిర్మాణ కార్మికులను మోహరించి పనులు చేపడుతున్నట్లు ఇ.ఇ. బి.ఎన్.ప్రసాద్ తెలిపారు.

బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ

పరిపూర్ణానంద సరస్వతి స్వామీజీని కఠినంగా శిక్షించాలి

- విశాఖ లో మహిళా సమాఖ్య నాయకురాలిపై చేయిచేసుకున్న ఎస్ఐ పై చర్యలు తీసుకోవాలి
- ఎన్ఎఫ్ఐడబ్ల్యు-ఏఐఎస్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర -విజయనగరం టౌన్: ప్రవచనాలు లోపల రాసలీలలా..? సిగ్గుచేటు 16 ఏళ్ల మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన పరిపూర్ణానంద సరస్వతి స్వామీజీని కఠినంగా శిక్షించాలని ఎన్ఎఫ్ఐ డబ్ల్యు, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్ బండ్ రోడ్డు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్ డబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత పావని మాట్లాడుతూ ఆధ్యాత్మిక ప్రవచ నాలు అంటూ నమ్మబలికి, దైవత్వాన్ని అపాదించుకుని, భక్తి ముసుగులోవంచన చేస్తూ ముక్కుపచ్చలారని మైనర్ బాలికలపై అఘాయిత్యానికి పాల్పడుతున్న పరిపూర్ణనంద సరస్వతి స్వామీజీ పైచట్టపరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలన్నారు. సమాజంలో ధర్మాన్ని, న్యాయాన్ని, పరిరక్షించేవారుగా మేమున్నామంటూ దైవత్వాన్ని అంటగట్టుకుని, సన్యాసుల మంటూ నమ్మించి, సూక్తులు బోధిస్తూ, చీకటిమాటున ఇటువంటి లైంగిక కార్యకలా పాలకు పాల్పడే దొంగ స్వామీజీల వల్ల అనేకమంది యువతులు మోసపోతున్నారన్నారు. తమపై జరిగిన అఘాయిత్యం కూడా చెప్పు కోలేని స్థితిలో, విషయం బయటకు వస్తే తమ ప్రాణాలకే ముప్పు అనే భయంతో, ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని జీవితాన్ని గడుపుతున్న ఘటనలు కొకొల్లలున్నయన్నారు. గతంలో ఇదే పరిపూర్ణ నంద స్వామిపై ఇదే రకమైన ఆరోపణలు వచ్చాయని, అప్పుడు అతనికి చట్టపరంగా సరైన శిక్ష పడి వుంటే ఈరోజు ఈ ఘటన పునరావృత మయ్యేదికాదన్నారు. అతని చీకటి కోణం పోలీసులకు, ప్రభుత్వాలకు తెలిసినా అతనిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయన మన్నారు. విశాఖ లో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన పరిపూర్ణానంద సరస్వతి స్వామీజీ ఆశ్రమం లోని లొసుగులను వెలికి తీయాలని, స్వామీజీని కఠినంగా శిక్షించాలని కోరుతూ ధర్నా చేస్తున్న మహిళా కార్యకర్తలపై పోలీసులు, నేరస్తులను చూసినట్లు చూస్తూ ఇష్టం వచ్చినట్లు కొట్టడం చూస్తే వీరు రక్షక భటులా.? లేక కాకీ ముసుగులో ఉన్న వీధి రౌడీలా..? అనే అనుమానం కలుగుతుందన్నారు. పరిపూర్ణానంద స్వామికి, ఆశ్రమానికి, కాపు కాస్తున్నట్లు వుందని, పోలీస్ వ్యవస్థ పై నమ్మకం పోయే పరిస్తితి దాపురించిందని, ఇప్పటి కైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని పరిపూర్ణ నంద స్వామిపై కఠిన చర్యలు తీసుకోవాలి, మైనర్ బాలికకు రక్షణ కల్పించాలి, ఆమెకు జీవనానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.విశాఖ లో ధర్నా చేస్తున్న మహిళ సమాఖ్య నాయకుల పై అన్యాయంగా చేయి చేసుకున్న ఎస్ఐ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ నాగ భూషణం మాట్లాడుతూ పూర్ణానందస్వామి ఆశ్రమంలో 14 మంది బాలికలలో ఒక మైనర్ బాలికను రెండు సంవత్సరాలుగా కాళ్లు చేతులు కట్టివేసి లైంగికంగా వేధింపులు చేయటంతో ఆశ్రమం నుంచి తప్పించుకుని రావటంతో వెలుగులోకి వచ్చిందనితెలిపారు. ఆశ్రమాలలో తల్లి తండ్రి లేని పిల్లలను రక్షిస్తారని చేర్పిస్తే, లైంగిక వేధింపులు చేస్తూ బాలికలను భక్షిస్తారా..? అని ప్రశ్నించారు. ఈ రకంగా లైంగిక వేధింపులకు పాల్పడటం దుర్మార్గమైన చర్య వెంటనే ప్రభుత్వం వెంటనే నిఘాపెట్టి, పర్యవేక్షణ చేసి నిందితుడిని శిక్షించాలి, బాలికలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు డి.సత్యనారాయణ ఎస్ఎస్ డబ్ల్యు నాయకులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర -రామభద్రపురం: యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్సై సురేంద్ర నాయుడు అన్నారు. గురువారం గ్లోబల్ స్కూలు, మరియు చొక్కాపు రామనాయుడు డైట్ కళాశాలలో మత్తు పదా ర్థాలపై యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించడం వలన యువత ఆరోగ్యం పాడవుతుందని జీవితం అంధకారమవుతుందని అన్నారు. మత్తు పదార్థాలు సేవించడం వలన కుటుంబం సర్వనాశనం అవుతుందని అన్నారు. విద్యార్థులు మత్తుపదార్థాలు వాడితే కేసు నమోదు చేసి జైలుకు పంపించవలసి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ కలశాల ప్రిన్సిపల్ గ్లోబల్ కళాశాల ప్రిన్సిపల్ విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలి

విశాలాంధ్ర-కొత్తవలస: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడానికి విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని ఎస్సై వీర జనార్ధన హేమంత్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక భారత డిఫెన్స్ అకాడమీ విద్యార్థులకు కౌన్సిలింగ్ చేశారు. డ్రగ్స్ వాడకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడకం విద్యార్థుల భవిష్యత్తుని నాశనం చేస్తుందని, అతి ప్రమాదకరమైన జీవితాన్ని అనుభవించాల్సి వస్తుందని ఆయన సూచించారు. డ్రగ్స్ రహిత రాష్ట్రాన్ని నిర్మించేందుకు అందరం కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. గంజాయి ,డ్రగ్స్ ను అరికట్టాలంటే విద్యార్థులు చైతన్యవంతమై పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు .

తహసిల్దార్ ను సన్మానించిన దళిత నేతలు

బడుగు బలహీన వర్గాల సమస్యలు పరిష్కరించాలని వినతి

విశాలాంధ్ర-వేపాడ: మండల తహశీల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన కే.ప్రసన్న కుమారును మండలానికి చెందిన ఉత్తరాంధ్ర మాల మహానాడు అధ్యక్షుడు గొల్ల ఈశ్వరరావు మరియు కమిటీ సభ్యులందరూ గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా దళిత నేతలు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యలను అవగాహన చేసుకుని వారికి న్యాయం చేసే విధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర మాల మహానాడు ప్రధాన కార్యదర్శి దేండేటి దేముడు, ఉపాధ్యక్షుడు బొత్స దేముదుబాబు,సారిక ఈశ్వరరావు,బొత్స మధు,దిమిసి సత్తిబాబు,మరియు మాల మహానాడు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యోగాలో అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో బాడంగి దివ్యాంగ విద్యార్థులు

విశాలాంధ్ర-తెర్లాం/బాడంగి: ఇంటర్నేషనల్ యోగ దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ గ్రౌండ్స్ లో ఉదయం 6నుండి7 వరకు సమగ్రశిక్ష ఆంధ్రప్రదేశ్, రోటరీ ఇంటర్నేషనల్ వారు సహ కారంతో 500మంది దివ్యాంగ విద్యార్థులచే వివిధ యోగాసనాలు వేయిం చటం నిత్యజీవితంలో యోగ ఉపయోగం,ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదు వంటి అంశాలతో విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 500 మంది దివ్యాం గులు పాల్గొని ఇంటరనేషనల్ వండర్ బుక్ అఫ్ రికార్డ్స్ నెలకొల్పారు. ఈ రికార్డ్స్ లో బాడంగి మండలం నుండి ముగ్గురు దివ్యాంగ విద్యార్థులు పాల్గొని వండర్ బుక్ అఫ్ రికార్డులో భాగస్వామ్యం ఐనందుకు దివ్యాంగ విద్యార్థులను,ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు, ఐఈఆర్పీ సత్యనారాయణను జిల్లా,మండల అధికారులు మరియు పాఠశాల హెచ్ఎం దత్తి సత్యనారాయణ,ఇతర ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

బొబ్బిలి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి బేబీనాయన

విశాలాంధ్ర-బొబ్బిలి: టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి బేబీనాయన జన్మదిన వేడుకలు వారోత్సవాలలో భాగంగా రాజా కాలేజ్ గ్రౌండ్లో స్వర్గీయ ఆర్ వి జి కే రంగారావు మెమోరియల్ టోర్నమెంట్ పేరున బొబ్బిలి ప్రీమియర్ లీగ్ ,ఉత్తరాంధ్ర జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ ను టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి బేబీనాయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆర్గనైజర్ గా 18 వ వార్డు టీడీపీ ఇంచార్జ్ బొత్స అప్పారావు (అప్పులు) వ్యవహరించారు..జూలై రెండు వరకు ఈ టోర్నమెంట్లు జరగనున్నాయని మొత్తం 12 టీములు గెలుపు కోసం పోటీ పడనున్నాని తెలిపారు. .ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, క్రీడాకారులు,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర -గంట్యాడ: శంకర్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మధుపాడ షిరిడి సాయి ఆలయ కమిటీ వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించబడింది. గురువారం గంట్యాడ మండలం మధుపాడ గ్రామం శిరిడి సాయి ఆలయం వద్ద సుమారు 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు, వారిలో 45 మంది కి ఆపరేషన్ అవసరం ఉందని ఎంపిక చేయడం జరిగింది వీరందరినీ ఇదే రోజు శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి బస్సులో విశాఖపట్నం తరలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కంటి వైద్యనిపుణులు శ్రీకాంత్, నర్స్ వెన్నెల క్యాంపు కోఆర్డినేటర్ జోగారావు గారు మధుపాడ గ్రామ పెద్దలు రిటైర్డ్ టీచర్ కొలుపూరి కృష్ణారావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి జన్మదిన వేడుకలు

పోటో:కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

విశాలాంధ్ర-కురుపాం: మాజీ ఉపముఖ్య మంత్రి, గిరిజన సంక్షేమ శాఖమాజీ మంత్రి, కురుపాం ఎమ్మెల్యే పాముల. పుష్పశ్రీవాణి జన్మదిన వేడుకలు చినమేరంగి లోతన నివాసంలో ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులు, నాయకులు ,కార్యకర్తలు ,అదికారులు అధిక సంఖ్యలో పాల్గొనీ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. వైసీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల. పరీక్షిత్ రాజుతోపాటు ఐదు మండలాల నాయకులు ,కార్యకర్తలు సమక్షంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి కేక్‌కట్ చేశారు. గుమ్మలక్ష్మీపురం లో మద్ది దొరబాబు సామాజిక ఆరోగ్య కేంద్రం లో రోగులకు పల్లు ,రొట్టెలు ,బిస్కెట్లు పంపిణీ చేశారు. పలుచోట్ల సేవా కార్యక్రమాలు అభిమాన నాయకురాలు హాయిగా ఉండాలని కోరుతూ చేపట్టారు.

ఆర్థాంవలస ఏనుగుల గుంపు

విశాలాంధ్ర -కొమరాడ : గురువారం మండలంలో ఎనిమిది ఏనుగులు గుంపు అర్థం పంచాయతీ అర్థం వలస పరిసరాలు ప్రాంతాల్లో ప్రవేశించినట్లు అటవీ అధికారి జి.ఏ.పి.ప్రసూన తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏనుగుల గుంపు రైల్వే పట్టాలు దాటే అవకాశం ఉందని, ఈ విషయాన్ని రైల్వే అధికారులకు తెలియజేసి ట్రైన్ ల వేగం నియంత్రణ ముఖ్యంగా గుమడ - ఆర్థాంవలస రైల్వే గేట్ల మధ్య చేయాలని కోరడం జరిగిందని ఆమె వివరించారు. ఏనుగుల పర్యవేక్షణ యూనిట్ అధికారులు రైల్వే అధికారులతో సమన్వయం చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఆ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జి.ఏ.పి.ప్రసూన కోరారు. ముఖ్యంగా రాత్రులు, వేకుజామున ప్రజలు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె తెలిపారు. అటవీ శాఖ అధికారులకు సహాయ సహకారాలు అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

డ్రాపౌట్స్ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలి : పీవో కల్పన కుమారి

విశాలాంధ్ర-సీతంపేట: చదువు మధ్యలో మానేసి డ్రాపౌట్స్ గా ఉన్న విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని ఐటిడిఎ పీవో కల్పన కుమారి అన్నారు. గురువారం సీతంపేట మండలంలోని కుడ్డపల్లి, కిల్లాడ గ్రామాల్లో పీవో పర్యటించారు. ఈ సంధర్భంగా పీవో మాట్లాడుతూ బడి బయట విద్యార్థులు ఎవరూ ఉండకూడదని, అందరూ చదువుకోవాలని అన్నారు. కుడ్డపల్లిలో 6 గురు విద్యార్థులను, కిల్లాడలో 4 గురు విద్యార్థులను, హిరమండలంలోని వూనుపేట గ్రామంలో 4 గురు విద్యార్థులను గుర్తించి వీరందరినీ తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో లిల్లిరాణి, ఏఎంవో కోటిబాబు, జీసీడీవో రాములమ్మ, సీఎంవో చిరంజీవులు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్టర్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జెసి

విశాలాంధ్ర-పాలకొండ: పట్టణ పరిధిలో ఉన్న సబ్ రిజిస్ట్రర్ కార్యాలయాన్ని గురువారం జెసి ఆర్ గోవిందరావు తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలో పలు దస్త్రాలను తనిఖీలు చేశారు. క్రయ విక్రయాలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సచివాలయాల పరిధిలో క్రయ విక్రయాలు జరిగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆయనతోపాటు తహశీల్దార్ సోమేశ్వరరావు, డీటీ సన్యాశిరావు, స్థానిక సబ్ రిజిస్ట్రర్ కె. సత్యన్నారాయణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ కె. శ్రీరామ్మూర్తి, సిబ్బంది ఉన్నారు.

జంఝావతి ప్రాజెక్టు పెండింగ్ పనులను చేపట్టాలి

రైతుసంఘం డిమాండ్

విశాలాంధ్ర-సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకొని జంఝావతి ప్రాజెక్టు పనులు పూర్తిచేసి సాగునీరు అందించే చర్యలు తీసు కోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పల నాయుడు విజ్ఞప్తి చేశారు. గురువారం మండలంలోని ఎన్.వెంకటాపురం గ్రామ సచివాలయం కార్యదర్శి వెంకట లక్ష్మికు రైతులతో కలిసి విజ్ఞాపనపత్రాన్ని అందజేసారు. ఈప్రోజెక్టు ద్వారా సాగునీరు అందించే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక గ్రామ రైతులతో సంతకాలసేకరణ కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు తెలిపారు. 1976లో జంఝావతి నదిపై ప్రాజెక్టుకట్టి సాగునీరిచ్చి సస్యశ్యామలం చేయడానికి 13. 50 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించగా, ఒరిస్సా ప్రభుత్వం తమ భూములు ముంపు గురవుతున్నట్లు చెప్పి అభ్యంతరం చెబితే ఆనాటి నుండి నేటి వరకు సుమారు ఐదుదశాబ్దాలు పనులు నిలిచి పోయాయని తెలిపారు.ఎన్నికల సమయంలో ఓట్లకోసం ప్రాజెక్టు సందర్శించి మేము అధికారంలోకి వస్తే ప్రాజెక్టుపని పూర్తి చేస్తామని చెప్పి హామీ ఇవ్వటమే తప్ప దానిపై చిత్తశుద్ధితో ఇంతవరకు ఏప్రభుత్వం పనిచేయడం లేదన్నారు. ఐదుమండలాలకు చెందిన 76 గ్రామాల ఆయకట్టు సుమారు 25వేల ఎకరాలకు రావాల్సిన సాగునీరు రాక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాజకీయాలకతీతంగా దశల వారి ఉద్యమంలో భాగంగా జులై15వరకు గ్రామసచివాలయాలకు విజ్ఞాపన పత్రంలు అందజేసి తదుపరికార్యాచరణను పార్వతీపురంలో నిర్ణయిస్తామని చెప్పారు. ఈనెల 28న సీఎం జగన్ కురుపాం నియోజక వర్గంలోని కార్యక్రమానికి వస్తున్నందున ఇప్పటికైన ఒడిస్సాతో మాట్లాడి పరిష్కారం చేయాలని కోరారు. కార్యక్రమంలో బుడితి గౌరునాయుడు, గోపాల కృష్ణ, శంకరరావు, వెలమల సత్యనారాయణ, వారాడ బోగేసి నాయుడు,మజ్జి సింహాచలం, వారాడ సత్యం నాయుడు బుడితి భాస్కర రావు, సిగడాపు వెంకటేష్ ,బుడితి బలరాం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జరిగిన ద్వారపురెడ్డి జగదీశ్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-పార్వతీపురం: పార్వతీపురం జిల్లాలోని టీడీపీఆశాజ్యోతి, మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్ జన్నదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ముందుగా షిర్డీ సాయి బాబా ఆలయానికి వెళ్ళి పూజలు నిర్వహించి తీర్థ ప్రసా దాలు స్వీకరించారు. అనంతరం టీడీపి పార్టీ కార్యాల యంలో నేతలు,అభిమానులు, కుటుంబసభ్యుల ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేకునుకోసి జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు. కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే, నియో జకవర్గ ఇంచార్జి బొబ్బిలి చిరంజీవులు,మాజీ మున్సిపల్ ఛైర్మన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, ప్రముఖ వైద్యులు రామ్మో హనరావు, ద్వారపురెడ్డి కుటుంబ సభ్యులు, నియోజకవర్గ నేతలు గర్భాపు ఉదయభాను, వాదాడ రాము, టిడిపిపట్టణ పార్టీ అధ్యక్షులు గుంట్రెడ్డి రవికుమార్, మండలపార్టీ అధ్యక్షుడు దొగ్గమోహన్, సీతానగరం మండలపార్టీ అధ్యక్షులు కొల్లి తిరుపతిరావు, నియోజకవర్గంలోని టీడీపినాయకులు గొట్టాపు వెంకటనాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, కోలాబాబు, రౌతు వేణుగోపాలనాయుడు ,తాతపూడి వెంకటరమణ, బదే గౌరునాయుడు, బోను దేవీచంద్ర మౌళి, నారాయణరావు, మజ్జి బ్రదర్స్,కెంగువ సుధీర్, బంకపల్లి రవికుమార్, కోలా వెంకటరావు, సిరిపురపు భాస్కరరావు, తాన్న ప్రసాద్, గొంగాడ రామ మూర్తి, మరిశర్ల కార్తీక్ నాయుడు, శంబంగి తిరుపతిరావు, బేత లక్ష్మణరావు, మరియదాస్, జాగాన రవిశంకర్, పాలకొండ రాజశేఖర్, రౌతు వేణుగోపాలనాయుడు, సాలహరి, బీమ శంకరరావు, శ్రీనివాసరావు, వెంకట నాయుడు, పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలంతోపాటు పార్వతీపురం పురపాలక సంఘంలోని నాయకులు, అభిమానులు, కార్యకర్తలతోపాటు జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల నేతలు కూడా పెద్ద ఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలియజేసారు. అదేవిధంగా రాష్ట్రపార్టీ కార్యాలయం నుంచి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు, పార్టీకి చెందిన పలువురు రాష్ట్రనేతలు, వివిధజిల్లాల నేతలు జగదీష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పార్వతీపురం మన్యం

పార్వతీపురం ఐటీడీఏలో రెగ్యులర్ డీడి ని నియమించండి

విశాలాంధ్ర -బెలగాం : పార్వతీ పురం ఐటీడీఏలో ఇంతవరకు అదికారులు బదిలీ అయ్యారంటే ఆస్థానంలో భర్తీచేయడం అగమ్యగోచరంగా మారునుందని, మాతృసంస్థల్లో కాకుండా వేరే సంస్థనుండి డెప్యూటేషన్లు వేస్తూ కాలయాపన చేస్తూ రెగ్యులర్ శిబ్బందిని నియమించడంలో ప్రభుత్వాలు విఫలమౌతున్నాయని దీనివలన గిరిజన సంక్షేమం అటకెక్కుతుందని మరియు అవినీతి జరిగేందుకు అవకాశాలు మెండుగా ఉంటుందని కావున చిత్తశుద్ధి ఉంటే రెగ్యులర్ డీడి ని నియమించాలని గిరిజన సంక్షేమ సంఘం తరుపున నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబు, ఆరిక ప్రభాకరరావులు డిమాండ్ చేస్తున్నామన్నారు.

విద్యుత్ షాక్ కు యువకుడు మృతి

విశాలాంధ్ర-సాలూరు రూరల్: మండలం లో మరుపల్లి గ్రామంలో గురువారం విద్యుత్ షాక్ తో ఓ యువకుడు మృతిచెందాడు.విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం ముచ్చర్లవలసకు చెందిన సువ్వాడ.జగదీష్(18) అను యువకుడు తన మేనమామ నడుపుతున్న టెంట్ హౌస్,సప్లయర్స్ షాప్ లో ఉంటూ మేనమామ తో కలసి టెంట్ హౌస్ పనులకు వెళ్తూ ఉంటాడు.అందులో భాగంగా సాలూరు మండలం మరుపల్లి గ్రామంలో కసినబోయిన వారి ఇంటి వద్ద ఆదివారం జరగబోవు శుభకార్యానికి గురువారం టెంట్ ఏర్పాటు చేస్తుండగా ప్రమాదవశాత్తు పైన ఉన్న విద్యుత్ వైర్లుకు పెండల్స్ తగలడంతో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు.వెంటనే మామిడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలపడంతో శవపంచనామా నినిత్తం మృతదేహాన్ని సాలూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.మృతుడి అన్నయ్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నామని రూరల్ ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు.మృతుడు తండ్రి గతంలో మరణించగా తల్లి వెంకటమ్మ,అన్న యుగంధర్ లు ఉన్నారు.జగదీష్ మృతితో మరుపల్లిలో ,స్వగ్రామం మచ్చర్లవలసలో విషాధచాయలు అలముకున్నాయి.

డైట్ సెట్ లో మక్కువ మండలం విద్యార్థి ప్రతిభ

విశాలాంధ్ర-మక్కువ: మన్యం జిల్లా పార్వతీపురం మక్కువ మండలంలో దబ్బగడ్డ పంచాయతీ విజయ రాంపురం గ్రామం చెందిన తాడంగి గణేష్ 12 ర్యాంకు సాధించారు తల్లిదండ్రులు ఇద్దరు వ్యవసాయ వృత్తిలో కొనసాగుతున్నారు ఉన్నారు. 12వర్యాంక్ సాధించిన విద్యార్థిని తల్లిదండ్రులు గ్రామస్తులు తోటి ఫ్రెండ్స్ అభినందించారు.

చిరుత సంచారం ఉదంతులతో గెడ్డలుప్పిని సందర్శించిన అటవీ అధికారులు

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని గెడ్డలుప్పి గ్రామంలో గురువారం మధ్యాహ్నా సమయంలో పెద్దపులి సంచరించినట్లు ఒకయువకుడు తీసినవీడియో వివిధ మాధ్యమాల్లో రాగా వెంటనే మన్యం జిల్లాఅటవీశాఖ అధికారులు,సిబ్బంది స్పందించి గ్రామాన్ని సందర్శించారు.ఈగ్రామానికి సాలూరు మండలం బాగువలసదరి పెదకుదమగ్రామానికి చెందిన చింతాడ యుగంధర్, మరికొంతమంది ఒక కార్యక్రమం నిమిత్తం వచ్చారు.వారు గ్రామానికి చివరలో కళ్ళాలవద్ద ఉంటున్న సమయంలో అటు వైపుగా ఒక్కసారి కనిపించిన ఒకజంతువును చూసి ముందుగా కుక్క లేదా నక్క అనుకున్నారు. అక్కడ ఉన్న యుగంధర్ ఒక్కసారి విజల్ వేయగా అది పులని గుర్తించి దాన్నిచూసి భయాందోళన చెందారు.20సెకండ్ల వీడియో కూడా తీసిన యుగంధర్ గ్రామ సర్పంచ్ అల్లు. తిరుపతినాయుడు,పంచాయతీ కార్యదర్శి మోహన్, తదితర గ్రామస్తుల సెల్ ఫోన్లకు పంపించాడు. ఇదే వీడియో మండల, జిల్లా గ్రూపులకు చేరింది. దీన్నిచూసిన పార్వతీపురం అటవీశాఖ ఫారెస్ట్ రేంజర్ పోలాకి త్రినాధరావు, పులి ముద్రలను గుర్తించే ప్రత్యేకఉద్యోగి అమర్నాథ్,అతనిసహాయకులతో గ్రామానికి విచ్చేశారు.అన్నింటినీ క్షుణ్ణంగా అధ్యయనంచేసిన తరువాత పెద్దపులి అడుగుజాడలు మాత్రం కాదని, వయస్సు పైబడిన చిరుతపులి అయిఉండవచ్చని తెలిపారు.పూర్తి స్థాయిలో పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు.ఏదిఏమైనా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వారికి అవగాహన కల్పించారు.గురువారంరాత్రి ప్రత్యేక సిబ్బంది గ్రామసచివాలయంలోనే ఉండి గ్రామస్తులకు భయాందోళన లేకుండా చూస్తారని తెలిపారు. పొలాల్లో కూడా మరోసారి పూర్తిస్థాయిలో పరిశీలనా చేస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ మనోజ్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సత్యనారాయణ, తదితర అటవీ శాఖ సిబ్బంది,సచివాలయం సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జిల్లా రీసోర్సు పర్సన్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర-విజయనగరం: ప్రధాన మంత్రి -సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమ క్రమబద్దీకరణ పథకము (పిఎంఎఫ్ఎంఇ)లో జిల్లా రిసోర్స్ పర్సన్ (డి.ఆర్.పి.) నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు, విజయనగరం జిల్లా ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటి కార్యనిర్వాహక సంచాలకులు, జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎ.వి.ఎస్.వి. జమదగ్ని ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటి (ఎపిఎఫ్‌పిఎస్) ఆధ్వర్యంలో జిల్లాలో ఇన్సెంటివ్ పద్ధతిలో పనిచేయడానికి ఆసక్తి కలిగిన వారి నుండి ధరఖాస్తులు కోరుతున్నట్లు ఆయన తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో డిగ్రీ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఇస్తామని, అలాగే వ్యవసాయ, ఉద్యాన డిగ్రీ లేదా ఏ ఇతర డిగ్రీ అయినా పూర్తి చేసి, బ్యాంకింగ్ పై అవగాహన కలిగిన వారు ధరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఆహార పరిశ్రమల ఏర్పాటుకోసం, ఔత్సాహికులకు అవగాహన కల్పిం చడం, బ్యాంకు లింకేజీ చేయించడం, ఆహార పరిశ్రమలు స్థాపనకు కృషి చేయడం జిల్లా రిసోర్స్ పర్సన్ విధులని పేర్కొన్నారు.

జిల్లా రిసోర్స్ పర్సన్ కు ఇన్సెంటివ్ పద్దతిలో మాత్రమే ప్రయోజనము కల్పించబడుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ బయోడేటాను పోస్ట్ ద్వారా గానీ, ఈ-మెయిల్ (డిడిహెచ్‌విజెడ్ఎంఏయాహూ.కామ్) (ddhvzm @yahoo.com) ద్వారా కానీ పంపించాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నెం.9573613747 లో లేదా, విజయనగరంలోని జిల్లా ఉద్యాన అధికారి వారి కార్యాలయం, మొదటి అంతస్తు, జిల్లా కలెక్టరు వారి కార్యాలయ సముదాయంలో సంప్రదించాలని సూచించారు.

బల్లుకోట రహదారి నిర్మాణ పనులు పరిశీలించిన ఐటీడీఏ పి.ఓ

విశాలాంధ్ర-కురుపాం: బల్లుకోట రహదారి నిర్మాణాన్ని పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణుచరణ్ పరిశీలించారు. రావాడ ఆర్ అండ్ బి రహదారి నుండి బల్లుకోట వరకు కొత్తగా రహదారి నిర్మాణం జరుగుతోంది. గురువారం ప్రాజెక్టు అధికారి పరిశీలించారు. కురుపాం మోడల్ స్కూల్ నిర్మాణ పనులు సైతం తనిఖీ చేసిన ప్రాజెక్టు అధికారి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. తరగతి గదులు విద్యా బోధనకు అందుబాటులోకి తీసుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారి జె. శాంతీశ్వర రావు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

లేఔట్ల వారిని బెదిరించి కోట్లు దోచేసే నువ్వా నీతి, చిత్తశుద్ధి గురించి మాట్లాడేది?

- సొంత పార్టీ ఎంపీటీసీలను ఓడించేందుకు డబ్బులు ఖర్చు చేసావు
- నీ బెదిరింపులతోనే తహశీల్దార్లు భయపడి వెళ్లిపోయారు
- ఎమ్మెల్సీ రఘురాజుపై వైఎస్సార్సీపీ నాయకులు ధ్వజం

విశాలాంధ్ర-శృంగవరపుకోట : నియోజకవర్గ పరిధిలో ఎక్కడ లేఔట్లు వేసినా నీవు, నీ వ్యక్తులు బెదిరింపులకు పాల్పడి కోట్ల రూపాయలు దోచేసే నువ్వా నీతి, చిత్తశుద్ధి గురించి మాట్లాడేదని వైఎస్సార్సీపీ ఎస్.కోట పట్టణ అధ్యక్షుడు షేక్ రెహమాన్ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుపై ధ్వజమెత్తారు. నువ్వు ఏ పార్టీలో ఉన్నా భూకబ్జాలు, సెటిల్మెంట్లు, ఎమ్మెల్యేలపై తిరుగుబాటు చేయడం నీకు పరిపాటిగా మారిందని విమర్శించారు. ఎస్.కోటలోని సుబ్బరామిరెడ్డి కళ్యాణ మంటపంలో వైఎస్సార్సీపీ పార్టీ పట్టణ నాయకులు గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు బొడ్డవర పరిధిలో 110 ఎకరాల గిరిజనుల భూములు, శ్మశానం కూడా కాజేసి కోట్లు కొట్టేసి బీజేపీలోకి వచ్చావు. నువ్వు ప్రారంభించిన కాపు సోంపురం లేఔట్లో సుమారు 30సెంట్లు ఆక్రమణలు ఉన్నట్లు తహశీల్దార్ కార్యాలయం ధృవీకరించిందని, అంటే కోటి ఇరవై లక్షలు నొక్కేయలేదా. ఇక ఆ లేఔట్లో భూమి కోసం మట్టి మార్పించే పనులకు డబ్బులు కట్టి ఇరిగేషన్ ఇచ్చిన అనుమతిని అడ్డుపెట్టుకుని రోడ్లు వేసి అక్రమాలకు నువ్వు పాల్పడలేదా?, ఇక నీ సొంతమైన కేంబ్రిడ్జ్ స్కూల్ భూమి గెడ్డ ఆక్రమణలో లేదని దమ్ముంటే నిరూపించుకో, నేను నిరూపించకపోతే రాజకీయాల నుండి వైదొలగడంతో పాటు దేవి జంక్షన్ వద్ద గుండు కొట్టించుకుంటా.. నువ్వందుకు సిద్ధమా అని రెహ్మాన్ సవాల్ విసిరారు. అప్పటి టీడీపీ ఎంపీపీ రెడ్డి వెంకన్న భూముల్లో వేసిన లేఔట్ సెటిల్మెంట్, ఇక గాయత్రీ ఆలయం వెనకాల వేసిన లేఔట్లో సెటిల్మెంట్లు. చెప్పు వాళ్ళు చేసుకోలేరా నువ్వెందుకు అన్నింట్లో దూరి పార్టీ పరువు తీస్తున్నావు. షాదీఖానా గెడ్డ భూమి అంటున్నావు, దమ్ముంటే రద్దు చేయించు. ఎమ్మెల్యే వల్ల కాదు నీ బెదిరింపుల మూలంగానే నియోజకవర్గ పరిధి మండలాల్లో తహశీల్ధార్లు బదిలీపై వెళ్లిపోయారు. నీ వాళ్ళతో రాజకీయాలు నెరుపుతూ రౌడీయిజం, దాదాగిరి చేస్తున్నది నువ్వే. పార్టీని భ్రష్టు పట్టిస్తున్నది నువ్వు. నీకు పార్టీ ఎమ్మెల్సీ పదవి ఇస్తే దాన్ని కూడా ఇష్టానుసారంగా వాడుకుంటూ మొన్నటి ఎంపీటీసీ ఎన్నికల్లో రాష్ట్రంలోనే పోటీలేని పరిస్థితిలో నువ్వు ఎదుటి పార్టీ వారితో కుమ్మక్కై, డబ్బులు ఖర్చు చేసి సొంత పార్టీ ఎంపీటీసీలను ఓడించావు నువ్వా నీతి నిజాయితీ గురించి వ్యాఖ్యలు చేసేదని ఎద్దేవాచేశారు. ఏ పార్టీ రూలింగ్లో ఉంటే ఆ పార్టీలోకి మారతావు, ఎక్కడ డబ్బులొస్తే అక్కడ నొక్కేస్తావు నువ్వా మాట్లాడేదని మండి పడ్డారు. పట్టణంలో పర్మిషన్లు లేకుండా ఎలా లేఔట్లు వేస్తున్నారు, నువ్వు కళ్ళు మూసుకుంటున్నావా సమాధానం చెప్పు. నీ చరిత్రంతా భూకబ్జాలే. నువ్వా నీతి గురించి మాట్లాడేది. నీకో కొడుకు, నాకో కొడుకు ఉన్నారు దమ్ముంటే నువ్వు తప్పు చేయలేదని ప్రమాణం చెయ్యి. నేను సిద్ధంగా ఉన్నా ప్రమాణం చేద్దామంటూ రెహ్మాన్ సవాల్ విసిరారు. ఇక నేతేటి శివ అనే నాయకుడు మాట్లాడుతూ కాపుసోంపురం లేఔట్లో ప్రభుత్వ స్థల ఆక్రమణలపై రెహ్మాన్ ఫిర్యాదు చేశారని, అక్కడ ఎంతమేర స్థలం ఆక్రమణ జరిగిందో అధికారులు ఎండార్స్మెంట్ ఇస్తామన్నారు. ఇక మట్టి కోసం ఇరిగేషన్ వారికి చేసుకున్న దరఖాస్తు ఏంటి? లక్షల క్యూబిక్ మీటర్ల ఆ మట్టిని తీసుకుని లేఔట్లో రహదార్లు వేస్తారా? ఇది అక్రమం కాదా? ఇక సొంత పార్టీ ఎమ్మెల్సీ రఘురాజు లేఔట్ వేసిన వారు నాపేరును వాడుకోవాలని, ఆ వ్యాపారంలో నాకు భాగస్వామ్యం ఉందని, ప్రతి లేఔట్లో కూడా నా పేరు పెట్టుకుంటే వారికి ధైర్యం ఉంటుందని ఎమ్మెల్సీ చెప్పడం దురదృష్టం అన్నారు. ఇక లేఔట్ ఆక్రమణలు, గెడ్డ భూమి ఆక్రమణలు ఇలా వీటన్నింటిపై విచారణ జరిపి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు పెనగంటి జగదీష్, కూనిరెడ్డి వెంకటరావు, కె.రంగా, మోపాడ కోటి, మోపాడ ఈశ్వరరావు, ఎంపీటీసీ కదారి అప్పయ్య, నామాల పార్వతి, కదారి జయశంకర్, మామిడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ యంత్రాంగం, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు జగనన్న సురక్ష క్యాంపు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-విజయనగరం: దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 23వ తారీకు నుంచి జగనన్న సురక్ష క్యాంప్ అనే నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కార్యక్రమంలో ప్రభుత్వం, పార్టీ యంత్రాంగం ప్రజల వద్దకు వెళ్లి 9అంశాలతో కూడిన ప్రభుత్వ పత్రాలను అందించేస్తారన్నారు. కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, జనన ధ్రువీకరణ, మరణ ధ్రువీకరణ, కుటుంబ ధృవీకరణ, వివాహ ధ్రువీకరణ, లావాదేవి మ్యుటేషన్లు, ఫోన్ నెంబర్ కు ఆధార్ అనుసంధానం, పంట సాగు హక్కు కార్డు వంటి ముఖ్యమైన పత్రాలను నేరుగా ప్రజల ఇంటి వద్ద నూతనంగా రూపొందించిన యాప్ లో ప్రతిస్పందనలు నమోదు చేసుకొని వారి పత్రాలను సేకరించి టోకెన్ నెంబర్ ద్వారా వారి సమస్యను పరిష్కారం చేసేందుకు ఏర్పాట్లు చేయడం జరిగింధన్నారు. జగనన్న సురక్ష క్యాంప్ కార్యక్రమంలో జిల్లా అధికార యంత్రాంగం, పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తిలక్ ఫౌండేషన్ సేవలు సమాజానికి స్ఫూర్తిదాయకం

మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :తిలక్ ఫౌండేషన్ సేవలు సమాజానికి స్ఫూర్తిదాయకమని మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రథమ లోక్ సభ సభ్యుడు అయిన కందాళ సుబ్రహ్మణ్య తిలక్ పేరిట స్థాపించిన తిలక్ ఫౌండేషన్ ద్వారా గురువారం అశోక్ బంగ్లాలో గరివిడి కి చెందిన అనాధ బాలిక వాగ్దేవి కి ఈ ఏడాది చదువు నిమిత్తం 20,000/- ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా అశోక్ గజపతి రాజు మాట్లాడుతూ తిలక్ పేరుతో ఫౌండేషన్ స్థాపించి సేవా కార్యక్రమాలు చేయడం హర్షణీయమన్నారు. కులమతాలకు అతీతంగా కె.ఎస్.తిలక్ పేద విద్యార్థుల చదువుకు తన జీవిత కాలమంతా ప్రోత్సాహాన్ని అందించి ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారని గుర్తు చేశారు. ఫౌండేషన్ తరపున ఆర్థిక సహాయం అందించిన డాక్టర్ ఐ. ఎస్. ఎన్. రాజును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ఫోరెస్ రాజు, కార్యదర్శి కందాళ సాయిబాబ, కోశాధికారి విజయరామకృష్ణ, సభ్యులు ఎర్నాయుడు, రామచంద్రరాజు, కృష్ణమోహన్,ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలతో చదువులు సాగించడం సాధ్యమా?

విశాలాంధ్ర- గజపతి నగరం: సమస్యలతో చదువులు సాగిం చడం సాధ్యమా అని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బి రాము ప్రశ్నించారు గురువారం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు ఈ సందర్భంగా గజపతినగరం నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద జాతీయ రహదారి పై రాస్తారోకో చేపట్టారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది నుంచి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వడం లేదని అన్నారు అందుకే చాలామంది విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అయ్యారని అన్నారు అదేవిధంగా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ ను ప్రారంభించి మంచినీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు మరుగుదొడ్లను సుబ్రపరిచి రన్నింగ్ వాటర్ ఏర్పాటు చేయాలన్నారు అదేవిధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు ప్రభుత్వం తక్షణమే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు అనంతరం తాసిల్దార్ కార్యాలయంలో పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తాసిల్దార్ అరుణకుమారికి అందజేశారు ఈ కార్యక్రమంలో మండల నాయకులు వినయ్ లక్ష్మణరావు రాము విద్యార్థులు పాల్గొన్నారు.

పండగకు ముస్తాబవుతున్న మరిడిమాంబ గుడి

విశాలాంధ్ర -వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామ ఇలవేల్పు అయిన శ్రీ శ్రీ మరిడిమాంబ గుడి ఈ నెల 29,30 తేదీలలో జరగబోయే పెద్ద పండగకు హంగులు రంగులతో ముస్తాబవుతుంది. కాగా ఈ రంగులకు మండపమునకు సంబంధించి టైల్స్ కు సుమారు రూ.3 లక్షలకు పైగా గ్రామానికి చెందిన గండి ముసల నాయుడు ఆర్థిక సహాయంతో వేయించడం జరుగుతుంది. అయితే వావిలపాడు గ్రామంలో మరిడిబాంబ పెద్ద పండగ జరిగి సుమారు 70 ఏళ్లకు పైబడి అవుతుందని మరల ఈ ఏడాది మరిడిమాంబ పెద్ద పండగను గ్రామస్తులు అందరూ ఐక్యతతో చేయడం ఆనందించదగ్గ విషయమని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ద్వారపురెడ్డి జన్మదిన సందర్భంగా మజ్జి బ్రదర్స్ అన్నదానం

విశాలాంధ్ర - పార్వతీపురం: పట్టణంలోని పాత బస్ స్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహం సమీపాన టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీశ్ పుట్టిన రోజు సందర్భంగా గురువారం నాడు పట్టణానికి చెందిన మజ్జి బ్రదర్స్ అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు. ముందుగా జగదీశ్ కు జన్మ దిన శుభాకాంక్షలు తెలిపారు. అన్నదాన కార్యక్రమంను జగదీష్ చేతుల మీదుగా ప్రారంభం చేశారు. ఈకార్యక్రమంలో మజ్జి బ్రదర్స్ రాజా, కృష్ణ మోహన్, వెంకటేశ్,టీడీపీనేతలు గర్భాపు ఉదయభాను, గుంట్రెడ్డి రవికుమార్,దొగ్గమోహన్, కోలా బాబు, కొల్లి తిరుపతిరావు, తాతపూడి వెంకటరమణ, బడే గౌరునాయుడు, బోను దేవీచంద్ర మౌళి, నారాయణరావు, మజ్జి బ్రదర్స్,కెంగువ సుధీర్, బంకపల్లి రవికుమార్, కోలా వెంకటరావు, సిరిపురపు భాస్కరరావు, తాన్న ప్రసాద్, గొంగాడ రామమూర్తి, మరిశర్ల కార్తీక్ నాయుడు, శంబంగి తిరుపతిరావు, బేత లక్ష్మణరావు, మరియదాస్, జాగాన రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రఘురాజుని విమర్శించే అర్హత ఎవరికీ లేదు?

- రఘురాజు వల్లే ఈ నియోజకవర్గంలో వైఎస్సార్సీపీ విజయం
- విలేకరుల సమావేశంలో ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు

విశాలాంధ్ర, శృంగవరపుకోట : వార్డు మెంబర్ స్థాయి లేనివాళ్ళు కూడా ఎమ్మెల్సీ రఘురాజుని విమర్శించడం బాధాకరమని, అటువంటి వారికి ఎమ్మెల్సీని విమర్శించే అర్హత ఉందా అని ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు ఎద్దేవా చేశారు. ఇక ఎమ్మెల్సీని విమర్శించిన రెహ్మాన్ ఎస్.కోటలో కట్టుకున్న ఇల్లు ఎక్కడుందని ప్రశ్నించారు. కేంబ్రిడ్జ్ స్కూల్లో ఎటువంటి ఆక్రమణ ఉంటే తొలగించాలని ఎమ్మెల్సీ రఘురాజే రెవెన్యూ వారికి లేఖ ఇచ్చిన విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. ఇక కొత్తవలసలో ఎమ్మెల్యే కడుబండి ఇంటి నిర్మాణం విషయంలో ఏ తప్పులేకపోయినా కోర్టు చుట్టూ తిరుగుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ఎస్.కోట సర్పంచ్ గనివాడ సంతోషికుమారి మాట్లాడుతూ ఎమ్మెల్సీ పేరెత్తే అర్హత లేని వారు, ఒక ఓటు వేయించలేని వారు ఎమ్మెల్సీపై ఆరోపణలు చేయడం తగదని హెచ్చరించారు. ఎమ్మెల్సీ రఘురాజు తన సొంత డబ్బులు ఖర్చు చేస్తూ.. భూములు అమ్ముకుని రాజకీయాలు చేస్తున్నారని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఇప్పటికైనా ఎమ్మెల్సీపై ఆరోపణలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, మేము పార్టీ నుండి బయటకు వెళ్లే పరిస్థితి కల్పించవద్దని హితవుపలికారు. మండల జేసీఎస్ ఇంచార్జ్ వెంకటరావు మాట్లాడుతూ కొంతమంది చోటా నాయకులు ఎమ్మెల్సీపై భూకబ్జా ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇలాంటి వారిని స్థానిక ఎమ్మెల్యే కడుబండి ప్రోత్సహించడం వల్లనే ఇలాంటివి జరుతున్నాయన్నారు. ఈ ఆరోపణల విషయంపై త్వరలో పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని, ఎమ్మెల్సీపై ఆరోపణలు చేసిన నాయకులపై చర్యలు తీసుకోనిపక్షంలో మేము వేరే పార్టీ చూసుకోవాల్సి ఉంటుందని వెల్లడించారు. సీనియర్ నాయకుడు బోజంకి గోవింద మాట్లాడుతూ లేఔట్ ప్రారంభానికి వెళ్ళిన ఎమ్మెల్సీపై కబ్జా ఆరోపణలు చేయడం తగదన్నారు. లేఔట్లో ఏమైనా అక్రమాలు, ఆక్రమణలు ఉంటే రెవెన్యూ అధికారులు తొలగిస్తారని తెలిపారు. ఒక గిరిజన కుటుంబం వద్ద నుండి ఈరోజు ఆరోపణలు చేసిన నేతల్లో ఒకరు పెద్ద ఎత్తున నగదు దోచుకుని పోతే ఎమ్మెల్సీ రఘురాజు ఇప్పించిన విషయాన్ని గుర్తు చేశారు. రైల్వే నుండి ఇటీవలే రిటైర్మెంట్ అయిన వ్యక్తి ఏం తెలుసునని ఎమ్మెల్సీపై ఆరోపణలు చేస్తున్నారని ప్రశ్నించారు. బీజేపీలో సీనియర్ నాయకుడుగా ఉన్న రఘురాజుని జగన్మోహన్ రెడ్డి పిలిస్తే పార్టీలోకి వచ్చారని, ప్రజల్లో రేయింబవళు తిరిగి ఎమ్మెల్యేగా కడుబండిని గెలిపించారని స్పష్టం చేశారు. ప్రజల్లో పట్టున్న రఘురాజు గురించి అవాకులు చవాకులు మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. జెడ్పీటీసీ ఎం.వెంకటలక్ష్మి మాట్లాడుతూ 2014లో కాంగ్రెస్ పార్టీ తరపున 32వేల ఓట్లు సాధించారని గుర్తు చేశారు. ప్రజల్లో రఘురాజుకి ఉన్న పట్టును గుర్తించే జగన్మోహన్ రెడ్డి పిలిచి పార్టీలో చేర్చుకున్న విషయాన్ని స్పష్టం చేశారు. వాకాడ రమణ మాట్లాడుతూ గుంటనక్కలు ఎమ్మెల్సీ రఘురాజుని విమర్శించడం సరికాదన్నారు. కొంత మంది వ్యక్తులు అంగన్వాడీ ఉద్యోగాలు ఇస్తామని, జగనన్న లేఔట్లో పలువురు నుండి ఇళ్ల నిర్మాణం పేరుతో దోచుకున్న వారు ఎమ్మెల్సీపై విమర్శలు చేయడాన్ని తప్పుబట్టారు. ఎమ్మెల్సీని విమర్శించిన వారిపై పార్టీ అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నియోజకవర్గంలో పార్టీ బలహీన పడే అవకాశం ఉందని వాపోయారు. సీనియర్ నాయకుడు సుంకరి ఈశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ రఘురాజు తమకున్న తాతల కాలం నాటి భూములను అమ్ముకుని రాజకీయాలు చేశారు. అంతేగానీ ఎవరో ఇస్తారని రాజకీయాలు చేయడం లేదని గుర్తు చేశారు. నోరుపారేసుకునే రెహ్మాన్ లాంటి వ్యక్తిని ఇటీవల మంత్రి బొత్స తీవ్రంగా హెచ్చరించిన విషయాన్ని బయట పెట్టారు. ఇలాంటి నాయకుల తీరుతో వైఎస్సార్సీపీ ఓటమి చెందే అవకాశం ఉందని ఆవేదన

సిహెచ్ఒ (ఎం.ఎల్.హెచ్.పి) లు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



విశాలాంధ్ర -బెలగాం: సిహెచ్ఒ (ఎం.ఎల్.హెచ్.పి) లు శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందజేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. గత కొద్ది రోజులుగా జిల్లా ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలపై సిహెచ్ఒలకు కొనసాగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ఆయన సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ మేరకు డాక్టర్ జగన్మోహనరావు మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా ప్రథమ చికిత్స, పాము కాటు, కుక్క కాటులకు చికిత్స, ఐవి ఇన్ఫ్యూషన్, అన్ని పద్ధతుల ఇంజెక్షన్లు వేయడం, గాయాలకు కుట్లు డ్రెస్సింగ్స్ చేయడం, తద్వారా జీవన ప్రమాణాన్ని పెంచే నైపుణ్యం మొదలగు వాటిపై సిహెచ్ఒలు పొందిన పరిజ్ఞానాన్ని గ్రామీణ ప్రజలకు ఆయా సందర్భాల్లో ఈ అత్యవసర వైద్య సేవలు అందజేయాలని తద్వారా వారి జీవన ప్రమాణం మెరుగు పడుతుందన్నారు. చికిత్స అనంతరం కొన్ని రోజుల వరకు ఆరోగ్య పర్యవేక్షణ తప్పని సరిగా ఉండాలన్నారు. అదేవిధంగా అత్యవసర వైద్య సేవల్లో వినియోగించే వైద్య పరికరాలు,మందులు, వాటి ఆవశ్యకతను, వినియోగించే విధానంపై పరిజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. ముఖ్యంగా మారు మూల గ్రామాలు, గిరిశిఖర గ్రామాలకు అత్యవసర వైద్యం, ప్రథమ చికిత్స ఆవశ్యకత మరింతగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్లు దుర్గాప్రసాద్, తిరుపతిరావు, ట్రైనర్స్ నీలిమ, సంతోషి లక్ష్మి , సిబ్బంది జయగౌడ్ పాల్గొన్నారు.

స్టేట్ టాపర్ కి అభినందించిన పివో

విశాలాంధ్ర-సీతంపేట:పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో టాపర్ నిలిచిన విద్యార్థిని ఐటిడిఎ పీవో కల్పన కుమారి బుధవారం అభినందించారు. పెద్దమడి ఆశ్రమ పాఠశాలను చెందిన గేదెల నిఖిత కు ఎస్టీ కేటగిరీలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంక్ రావడంతో సీఎం చేతుల మీదుగా రూ 1,00,000/- చెక్కును అందుకున్నారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా ఇలానే బాగా చదవాలని సూచించారు. చదువే అన్ని సమస్యలకు మార్గం చూపుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ శ్రీనివాసరావు, డిప్యూటీ డీఈవో లిల్లీరాణి పాల్గొన్నారు.

మాతా,శిశు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డీఎంహెచ్ఓ జగన్నాథరావు



విశాలాంధ్ర-బెలగాం : మాతా, శిశు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు హెచ్చరించారు. ఈ మేరకు జిల్లా ఆరోగ్య కార్యాలయంలో గురువారం ఆశా నోడల్ అధికారులకు(సూపర్ వైజర్స్) పలు ఆరోగ్య కార్యక్రమాల పై నిర్వహించిన సమావేశంలో డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ గర్భిణీ నమోదు అయినప్పటి నుండి ప్రసవం తర్వాత కొన్ని రోజుల పాటు వైద్య సిబ్బంది పర్యవేక్షణ ఉండాలని, గర్భిణీలకు నిర్వహించిన ఆరోగ్య పరీక్షలు, తనిఖీలు అనంతరం అసాధారణంగా గుర్తించిన పారా మీటర్స్ పై దృష్టి సారించి వెంటనే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రగతి నివేదికలు వారీగా సమీక్ష జరిపి సిబ్బందిని ఆరా తీశారు. గర్భిణీ ల నమోదు, ఆయిష్మాన్ భారత్ హెల్త్ ఐడి మ్యాపింగ్, మొదటి త్రై మాసిక గర్భిణీల నమోదు, ఆరోగ్య పరీక్షలు, హై రిస్క్ గర్భిణీలను గుర్తించడం, వాటి పర్యవేక్షణ, గర్భిణీలకు టిడి టీకా రెండు డోసులు, ఐరన్ మాత్రల పంపిణీ, వాటి వివరాలు, ఈ-ఆశా అప్లికేషన్ లో ఇసి,హెచ్బివైసి, హెచ్బిఎన్సి ఆరోగ్య వివరాల నమోదు, ఐదు సం.లోపు పిల్లల హెల్త్ స్క్రీనింగ్ వివరాలు అప్లోడ్ , గర్భిణీల సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలు నిర్దేశిత సమయంలో అప్లోడ్ చేయడం మొదలగు అంశాలపై సమీక్ష జరిపి వైద్య సిబ్బంది ఏ మాత్రం అశ్రద్ధ చూపినా తగు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు మాట్లాడుతూ ప్రసవం సమయ తేదీ దగ్గర పడుతున్న కొద్దీ గర్భిణీలపై మరింత ఆరోగ్య పర్యవేక్షణ ఉండాలని తద్వారా ఏ చిన్న ప్రమాదకర సూచనలు ఉన్నా గుర్తించి నివారించడం వల్ల ముందస్తు జాగ్రత పడవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఒ లీలారాణి, డిపిహెచ్ఎన్ఒ ఉషారాణి, హెచ్ఈ విజయలక్ష్మితదితరులు పాల్గొన్నారు.

మధుపాడ హెడ్ వాటర్ వర్క్స్ ను సందర్శించిన పర్యవేక్షక ఇంజనీర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ నిదులతో చేపడుతున్న అభివృద్ధి పనులు పరిశీలించుటకు గాను పర్యవేక్షక ఇంజనీర్ ప్రజారోగ్య సాంకేతిక శాఖ విశాఖపట్నం. రాజారావు విచ్చేసి మధుపాడ హెడ్ వాటర్ వర్క్స్ ను సందర్శించి మోటార్స్ ను పరిశీలించి ఇంజనీరింగ్ సిబ్బంది కి తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది అనంతరం విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ లో చేపడుతున్న అర్బన్ హెల్త్ క్లినిక్లు, గారిబేజీ ట్రాన్సట్ స్టేషన్స్, గడప గడపకు మనప్రభుత్వం, డెవలప్మెంట్ అఫ్ పెద్ద చెరువు మరియు 15 వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న మంచినీటి ట్యాంకులు పనులను సంబందిత అధికారులతో పరిశీలించారు అనంతరం ఇంజనీరింగ్ అధికారులతో వివిధ అబివృద్ధి పనుల టెండర్లు త్వరితగతిన పిలిచి పనులు పూర్తి చేయవలసినదిగా సమీక్ష సమావేశం నిర్వహించి తగు సూచనలు చేశారు. మంచినీటి సరఫరా పథకముల యొక్క పనులు త్వరితగతిన పూర్తిచేయవలసినదిగాఇంజనీరింగ్ అధికారులకు సూచనలు చేసియున్నారు. పర్యవేక్షక ఇంజనీర్ ప్రజారోగ్య సాంకేతిక శాఖ విశాఖపట్నం కె. రాజారావు వారితో కె.శ్రీనివాసరావు , మున్సిపల్ ఇంజనీర్, డిఇఇ. ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక పనులు కాక సంపూర్ణ పనులు చేపట్టాలి

విశాలాంధ్ర-దత్తిరాజేరు : దత్తి గ్రామ దళితుల పేట ప్రక్కనున్న కొండాపు చెరువు వలన ముంపుకు గురై చాలాకాలం నుండి దళితులు ఇబ్బందులు పడుతున్నారని తాత్కాలిక పనులు కాకుండా సంపూర్ణ పనులు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్ గురువారం దళితులతో కలిసి ఒక ప్రకటనలో తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాములు, తేళ్లు ఎప్పుడు కాటేస్తా యోనని బితుకుబితుకుమంటూ వారు జీవనం కొనసాగిస్తున్నారన్నారు.చెరువు ముంపు నుండి వారిని రక్షించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద, మండల కార్యాలయాల వద్ద, గ్రామ సచివాలయాల వద్ద పలుమార్లు పోరాటాలు, ధర్నాలు, విన్నపాలు విన్నవించుకుంటే తత్ఫలితంగా అధికారులు, నాయకులు నేటికి స్పందించి గట్టు ఎత్తు పెంచడానికి ఉపాధి హామీ పథకం నిధులు నుండి తాత్కాలికి పనికి మార్గం చూపారని అన్నారు. తాత్కాలికంగా కాక సంపూర్ణ పరిష్కారానికి అధికారులు, నాయకులు చొరవ చూపాలని కోరారు.ఈ కార్యక్రమం లో సిహెచ్ గురువులు, సిహెచ్ జోగి రాధ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నవోదయ కు సరస్వతీ విద్యానికేతన్ విద్యార్థిని ఎంపిక

విశాలాంధ్ర-కురుపాం: స్థానిక సరస్వతీ విద్యా నికేతన్ లో చదువుతూ 2023-24 ఆరవతరగతి నవోదయ ప్రవేశ పరీక్ష లో ఎంపికైన వై.సాయి సూర్య..(హాల్ టికెట్ నం.1071229) 92/100మార్కులు సాదించి ఎంపికైంది. ఈసందర్భంగా సరస్వతీ విద్యాని కేతన్ కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

రిజర్వ్ బ్యాంక్ క్విజ్ లో ధర్మవరం విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర -శృంగవరపుకోట: రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన క్విజ్ కార్యక్రమంలో మండల స్థాయిలో ధర్మవరం విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఇన్చార్జి హెచ్ఎం ఆర్ వి ఎస్ ఎన్ మూర్తి తెలిపారు. బుధవారం నాడు శృంగవరపుకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్విజ్ కార్యక్రమంలో మండల స్థాయిలో ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న జామి ప్రేమ్ కుమార్, సమయమంతుల లోకేష్ తృతీయ స్థానం గెలుచుకున్నారని, ఇందుకుగాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మండల స్థాయిలో రిజర్వ్ బ్యాంకు క్విజ్ లో తృతీయ స్థానం గెలుచుకున్న ఒకొక్క విద్యార్థి ఖాతాలో 1570 రూపాయలు జమ చేసినట్లు గురువారం తెలి పారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు జామి ప్రేమ్ కుమార్, సమయమంతుల లోకేష్ లను , వీరికి గైడ్ టీచర్ గా వ్యవహరించిన గణిత ఉపాధ్యాయులు బి.కిరణ్ కుమార్ లను ఇన్చార్జి హెచ్ఎం ఆర్వీఎస్ఎన్ మూర్తి, పిఎంసి చైర్మన్ తగరంపూడి రమణ కళాశాల అధ్యాపకులు రహీం షేక్‌లాల్, యస్ వి యస్ యన్ మూర్తి (సతీష్ మాస్టర్) ఉపాధ్యాయులు వి.ఈ. సత్యనారాయణ, పొట్నూరు శ్రీరాములు, హరి, కిరణ్ కుమార్ ఎల్వి సత్యనారాయణ, విద్యార్థులు అభినందించారు.

పీహెచ్‌సీలో జగనన్న గోరుముద్ద ని ఎంపీడీఓ తనిఖీ

విశాలాంధ్ర-తెర్లాం:మండలంలో ఎం.ఆర్. అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా నిర్వహిస్తున్న జగనన్న గోరుముద్దని తనిఖీ చేసిన ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ. ఈ సందర్భంగా పథకము అమలవుతున్న తీరు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలన చేసి, విద్యార్థులకు సమయానికి రాగిజావ అందించాలని, ఆహ్లాదకరమైన వాతావరణం లో భోజనం అందించాలని నిర్వాహకులకు, నిరంతర పర్యవేక్షణ చేయాలని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ వారికి సూచించారు.

వెల్నెస్ సెంటర్, చెత్త నుండి సంపద కేంద్రాల పరిశీలన

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో ఎం.ఆర్. అగ్రహారం సచివాలయం పరిధిలో నిర్మిస్తున్న వెల్నెస్ సెంటర్, చెత్త నుండి సంపద కేంద్రాలను పరిశీలన చేసిన మండల అభివృద్ధి అధికారి ఎస్.రామకృష్ణ. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించుకోడానికి వెల్నెస్ భవనం నిర్మాణం పూర్తిచేసి అప్పగించవలసిందిగా క్రాంట్రాక్టర్ వారిని కోరడం జరిగింది. చెత్తనుండి సంపద కేంద్రాలను త్వరగా ఆచరణలోనికి తీసుకురావలసిందిగా పంచాయతీ కార్యదర్శి వారికి ఆదేశించడం జరిగింది.

26 నుండి ఎస్.కోట డిపో నుంచి 4 బడి బస్సులు పునరుద్ధరణ

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఈనెల 26వ తేదీ నుండి ఎస్.కోట డిపో నుంచి 4 బడి బస్సులు పునరుద్ధరణ ఈనెల 26వ తేదీ నుండి ఎస్.కోట డిపో పరిధిలో 4 బడి బస్సులను పునరుద్దరిస్తున్నట్లు డిపో మేనేజర్ కె.రమేష్ గురువారం తెలియచేసారు. కావున విద్యార్థులు అందరు తగిన ధ్రువపత్రములతో బస్సు స్టేషన్లో వున్న బస్సు పాస్ కౌంటర్లో సంప్రదించి అన్ని రకముల పాస్ లు తీసుకో వచ్చునని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని వినియోగించు కోవల్సినదిగా డిపో మేనేజర్ సూచించారు. ఈ బస్సులు కొండగంగుబూడి, గొలజామ్, ముసిరాం, వావిలాపాడు, వేపాడ, ఆనందపురం, బక్కు నాయుడు పేట గ్రామాల విద్యార్థు కు ఉపయోగపడతాయని డిపో మేనేజర్ రమేష్ వివరించారు.

అడిగిన వారందరికీ జాబ్ కార్డులు అందించాలి

విశాలాంధ్ర -గజపతినగరం: అడిగిన వారందరికీ జాబ్ కార్డులు అందించాలని జిల్లా జల యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమా మహేశ్వరి ఆదేశించారు గురువారం గజపతినగరం మండలంలోని ఎం గుమడం గ్రామంలో పీడీ సందర్శించారు ఎవరెవరికి జాబ్ కార్డులు కావాలో అడిగి వెంటనే జాబ్ కార్డులు అందించాలని ఆదేశించారు అలాగే పని కోరిన వారికి వెంటనే పని ఇవ్వాలన్నారు ఈ కార్యక్రమంలో సోషల్ ఆడిట్ ఎస్ఆర్పి మాధవి ఏపిఓ సిహెచ్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమం పై అవగాహన

విశాలాంధ్ర -గజపతినగరం: మండలంలోని గంగచోళ పెంట గ్రామ సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం గూర్చి గజపతినగరం మండల జెసిఎస్ కన్వీనర్ కనకల సుబ్రమణ్యం అవగాహన కల్పించారు ఈ కార్యక్రమాన్ని ఎలా ప్రారంభించి ముగించాలో సమగ్రంగా వివరించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోని సంగమయ్య ఎంపీటీసీ పైడన్న మరియు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ ప్రభంజనాన్ని ఏ శక్తి అడ్డుకోలేదు

– మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర-శృంగవరపుకోట : తెలుగుదేశం పార్టీ ప్రభంజనాన్ని ఏ శక్తి అడ్డుకోలేదని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శృంగవరపుకోట మండలం, తిమిడి గ్రామంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు జి.ఎస్.నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి కోళ్ల లలిత కుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆ గ్రామ మహిళలు హారతులిస్తూ బ్రహ్మరథం పడుతూ, సన్మానించడం జరిగింది. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధముగా ఉన్నారన్నారు. నాలుగు సంవత్సరాల జగన్మోహన్ రెడ్డి చేతకాని పాలనలో ఆంధ్ర రాష్ట్రం అన్ని రంగాల్లో దివాళా తీసిందని, ఆంధ్ర ప్రదేశ్ ప్రజలపై పది లక్షల కోట్లు అప్పుల బారిన మోపి తన గొప్పలు కోసం రాష్ట్ర ప్రజలను తిప్పలు పెడుతున్నారని అన్నారు. ఈ నాలుగేళ్లలో కేవలం 8-9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి రాష్ట్ర ప్రజలపై యాభైయారు వేల కోట్ల రూపాయలు భారం వేసి దొంగ దెబ్బ తీశారని అన్నారు. ఈ మేరకు మహానాడు వేదికగా మహిళలకు మహాశక్తిలో భాగంగా విడుదల చేసిన మినీ మేనిఫెస్టో రాష్ట్ర ప్రజలకు చాలా మేలు కలుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, తిమిడి గ్రామ కమిటీ అధ్యక్షులు రాయవరపు రవి శంకర్, ఐటీడీపి రాష్ట్ర కార్యదర్శి చెక్కా కిరణ్ కుమార్, విశాఖ టీడీపీ పార్లమెంటరీ కార్యనిర్వహక కార్యదర్శి కాపుగంటి శ్రీనివాసు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, టీడీపీ కార్యకర్తలు, అధిక సంఖ్యలో మహిళలు, రైతులు, యువత పాల్గొన్నారు.

స్త్రీ నిధి రికవరీ శత శాతం చేయాలి

వెలుగు ఏరియా కో ఆర్డినేటర్

విశాలాంధ్ర-వంగర : మండలంలో స్త్రీ నిధిలో రికవరీ శతశాతం వసూలు చేయటానికి చర్యలు చేపట్టాలని వెలుగు ఏరియా కో ఆర్డినేటర్అలుగోలుచిరంజీవి విఓఏలకు అదేశాలు జారీచేశారు. గురువారం మధ్యాహ్నం వెలుగు సిబ్బంది,వి ఓఏలతో మండల మహిళా సమాఖ్య భవనంలో సమావేశం లో మాట్లాడారు. అదే విధంగా అన్ని సంఘాలు "ఏ" గ్రేడ్ లో కి తీసుకు రావాలని కోరారు. పీఎంఈజిపి, పీఎం ఎఫ్ ఎం ఈ ప్రతీ గ్రామ సంఘం నుండి లబ్ధిదారులును ఎంపిక చేసి బ్యాంకు లకు తీసుకువెళ్లాలని ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమం లో లైవ్ స్టాక్ డీపీఎం మూర్తి మాట్లాడుతూ అర్హత గల మహిళా ఆంఘ సభ్యులను గుర్తించి వారికి ఆవులు, గేదెలు, గొర్రెలు తీసుకొని పెంచుకొనేవాళ్ళని గుర్తించి పి ఎం జీపీ ద్వారా రుణాలను మంజూరు చేయించేటట్లు చేసి,వారికి అందేటతట్లు చుడాల ని కోరారు. సమావేశంలో వీరితో పాటు ఏ పీ ఎం మీ సాల చక్రపాణి, ఎఫ్ పీ ఏ పీఎం గోవింద్, ఎల్ సీ ఏపీఎం అప్పలనా యుడు, ఎస్ ఎస్ మేనేజర్ సుధాకర్, వెలుగు సీసీలు, పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారుల మార్పు

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లాలో పలు మండలాల ప్రత్యేక అధికారులను మార్పు చేస్తూ కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ ఆదేశాలు జారీ చేశారు. రేగిడి ఆమదాలవలస మండల ప్రత్యేక అధికారిగా డి.ఆర్.డి.ఏ. ప్రాజెక్ట్ డైరెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, బొబ్బిలి మండల ప్రత్యేక అధికారిగా జిల్లా పౌరసరఫరాల అధికారి మధుసూదన రావు, బాడంగి మండలానికి డ్వామా పిడి ఉమా పరమేశ్వరి, సంతకవిటి మండలానికి తోటపల్లి ప్రాజెక్టు భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ ను నియమించారు. ఆయా జిల్లా అధికారులు తమకు కేటాయించిన మండలాల్లో అధికారులు, సిబ్బందిని సమన్వయ పరుస్తూ ప్రభుత్వ పథకాలు, ప్రాధాన్యత కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు: డిప్యూటీ మేయర్ శ్రావణి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దేనని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ఉత్తమ ప్రతిభను కనబరిచి, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. గురువారం జమ్ము నారాయణపురం వద్దనున్న మహాత్మ జ్యోతి బాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉత్తమ ప్రతిభ చూపిన పదవ తరగతి విద్యార్థులకు నగదు బహుమతిని, ప్రశంసా పత్రాన్ని, జ్ఞాపికలను ఇచ్చి సత్కరించారు. విద్యార్థులు నందకిషోర్, మణికంఠ, దివ్య లోచన పట్నాయక్ లను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచుతూ ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్న జగన్ మోహన్ రెడ్డి ఆదర్శప్రాయుడని అన్నారు. గతంలో దివంగత నేత రాజశేఖర్ రెడ్డి హయాంలోనూ, ఆ తర్వాత ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ హయంలోనూ విద్యా వ్యవస్థలో సమూల మార్పులను తీసుకొచ్చి విప్లవాత్మక సేవలను అందిస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఫలితా లను మరింతగా మెరుగు పరచడమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నాడు నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల రూపురేఖలను మార్చారని అన్నారు. అలాగే పౌష్టికాహారాన్ని మెరుగుపరిచి విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతున్నారన్నారు. ప్రస్తుతం ర్యాంకుల సాధించిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకుని తదుపరి విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. నగర మేయర్ ముచ్చు లయ యాదవ్, ఏఎంసి చైర్ పర్సన్ నడిపేన శశి భార్గవి, ప్రిన్సిపల్ ఎం. శంకర రావు, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన కు ముందస్తు ఏర్పాట్లు పరిశీలన

విశాలాంధ్ర-కురుపాం: ఈనెల 28న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కురుపాం పర్యటన ..నాలుగో విడత అమ్మ ఒడి పంపిణీ ప్రారంభం నేపథ్యంలో కలెక్టర్ నిషాంత్ కుమార్ ఎస్పీవిక్రాంత్ పాటిల్ ,ఎఎస్పీ లు. పలుచోట్ల స్థల పరిశీలన చేశారు. అనంతరం సభావేదిక వద్ద మౌలిక సదుపాయాలు ,ఇతర ఏర్పాటు లను పరిశీలించారు. పార్కింగ్ స్థలం ,హెలీప్యాడ్ ,రూట్ మ్యాప్ లను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం వివిధ శాఖ ల అధికారులు కు పలుసూచనలు చేశారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎక్కడ ట్రాఫిక్ సమస్యలకు తావులేకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు. పలుశాఖల జిల్లా అధికారులు ఈసందర్భనలో పాల్గొన్నారు.

వర్షాలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

పారిశుధ్య పర్యవేక్షకులకు, కార్యదర్శులకు కమిషనర్ ఆదేశాలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: నగరంలో వర్షాలు కురిసే సమయంలో ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పారిశుధ్య పర్యవేక్షకులకు, కార్యదర్శులకు కమిషనర్ ఆర్ శ్రీరాములు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వర్షాలు కురిసే సమయంలో వర్షపు నీరు రహదారులపై నిలిచిపోకుండా ముందస్తుగానే నీటి ప్రవాహ మార్గాలను గుర్తించి పరిశుభ్ర పరచాలని చెప్పారు. చెరువులు, కుంటల వైపు నీరు పారే విధంగా మార్గాలను ప్రక్షాళన చేయాలని చెప్పారు. పెద్ద చెరువు చుట్టూ ఉన్న తొమ్మిది నీటి ప్రవాహపు మార్గాలను జెసిబి లు సహాయంతో పరిశుభ్రపరచాలన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి నీరు నిలవ లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. అలాగే క్లాప్ యూజర్ చార్జీలు వసూళ్లలో నగరపాలక సంస్థ చివరి స్థానంలో ఉండడం సహించరానిదని అన్నారు. ఇచ్చిన మార్గదర్శకాలు,లక్ష్యాల ప్రకారం క్లాప్ యూజర్ చార్జీలను వసూళ్లను ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

విశాలాంధ్ర- పాల కొండ: అంగన్ వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తారని, చిన్నారులను కేంద్రాలకు పంపించాలని పాలకొండ సెక్టార్ సూపర్ వైజర్ టి. మేరీ ఆదేశాల మేరకు. జన బాగిధారి కార్యక్రమంలో భాగంగా కొమటిపేట అంగన్వాడీ కేంద్రంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులను అంగన్వాడీలో చేర్పించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంతో ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నూతలపాటి భూషణ్ మణి ఆయాలు మహిళా పోలీస్ పిల్లలు తల్లిలు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా చేశారని అంగన్వాడీ కార్యకర్త నూతల పాటి భూషణ్ మణి తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం - బెల్లం రైతులను ఆదుకుందాం..

విశాలాంధ్ర - బొబ్బిలి: ప్రస్తుత పరిస్థితుల్లో ఘన ఆరోగ్యం కోసం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించపలసిస అవసరం ఎంతైనా ఉంది, ఇది మన భవిష్యత్ తరాలకు చాలా అవసరం అని లోక్ సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర రావు అన్నారు. ఆయన మండలం ముగడ గ్రామంలోని ప్రక్రుతి వ్యవసాయం ద్వారా పండించిన చెరకుతో తయారుచేసిన బెల్లం రైతులను కలిసిన అనంతరం మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఈ సేంద్రీయ బెల్లం కొనుగోలు చేస్తాం అన్నారు అయితే అనివార్య కారణాల వలన బెల్లం కొనుగోలు ఆలస్యం అవుతున్న నేపథ్యంలో రైతుల ఆవేదనని అర్థం చేసుకొని మనమే ఆ బెల్లాన్ని కొనుగోలు చేసి రైతులను, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తే బాగుంటుందని నా ఆలోచన. ఈ సమస్యను రాజకీయ కోణంలో కాకుండా మన నియోజక వర్గంలోని కోమటిపల్లి, ముగడ గ్రామాల రైతులను ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో చూడాలని నా మనవి. అందుకు అన్ని రాజకీయ పార్టీల వారు, ప్రజా సంఘాల వారు, వర్తక సంఘాల వారు, వ్యాపారస్థులు, దేవాలయాల సిబ్బంది ఈ సేంద్రీయ బెల్లం కొనుగోలుకు తమ వంతు కృషి చేయాలని నా విజ్ఞప్తి. నియోజక వర్గంలో ఇంటికి ఒక కేజీ బెల్లం కొనుగోలు చేసినా మన రైతుల దగ్గర మొత్తం బెల్లం అయిపోతుంది. మరీ ముఖ్యంగా మీడియా మిత్రులు ఈ విషయాన్ని విరివిగా ప్రచారం చేస్తే సమస్య తొందరగా పరిష్కారం అయి రైతులు లాభపడతారు. అలాగే ఈ విషయాన్ని చదివిన అందరూ కూడా మీమీ సామాజిక మాధ్యమాలలో విరివిగా ప్రచారం చేసి ఈ ప్రక్రుతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేట్టుగా చెయ్యాలని నా విన్నపం. సేంద్రీయ బెల్లం కావలసిన వారు ఈ నెంబరును 9381310124 సంప్రదించాలని కోరారు కోరారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందని, సంక్షేమ పథకాల అమలులో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దేశంలోనే నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఫ్లోర్ లీడర్ ఎస్వీవీ రాజేష్ అన్నారు. నగరంలోని 14వ డివిజన్ పరిధి కొత్తపేటలో గురువారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి స్థానికులు సాదర స్వాగతం పలికారు. ఎక్కడికక్కడ కుంకుమ తిలకం దిద్ది హారతులిచ్చారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరిస్తూ, వైసీపీ ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని ఆరా తీశారు. అక్కడికక్కడే పరిష్కారం చూపారు. అనంతరం శ్రావణి, రాజేష్ మీడియాతో మాట్లాడుతూ.. అవినీతి, లంచగొండితనం లేని పాలనను ముఖ్యమంత్రి జగన్ అందిస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తూ పారదర్శక పాలన సాగిస్తున్నారన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన దగ్గరనుంచి కోలగట్ల వీరభద్ర స్వామి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా పాటుపడుతున్నారన్నారు. ప్రతిరోజూ నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటిస్తూ ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. అటు అభివృద్ధి కార్యక్రమాలు, ఇటు సంక్షేమ పథకాలను సమపాళ్లలో అమలు చేస్తున్నారని కొనియాడారు. మరో మారు మనమంతా ఆయనకు మద్దతు పలికి అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్పర్సన్ నడిపేన శశి భార్గవి, నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ ప్రసాదరావు, కార్పొరేటర్ బండారు ఆనందరావు,స్థానిక నాయకులు, కార్యదర్శులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

బీసీలను విస్మరించిన పార్టీలకు గుణపాఠం చెబుతాం

వెనుకబడిన వర్గాలకు అండగా నిలిచినది జగన్ ఒక్కరే

వచ్చే నెలలో విజయనగరంలో బీసీల మహాగర్జన

బీసీల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారేష్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : రాజకీయంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల పట్ల చిన్నచూపు చూసే ఏ పార్టీకైనా తమ సత్తా చూపిస్తామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎస్. మారేష్ స్పష్టం చేశారు. గురువారం విజయనగరం చేరుకున్న ఆయన.. సంఘం జిల్లా అధ్యక్షులుగా నడిపేన శ్రీనివాసరావు(జమ్ము శ్రీను)ను నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలిగా సుధాకృష్ణని నియమించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కట్టుబడి ఉన్నారని పునరుద్ఘాటించారు. వెనుకబడిన వర్గాల ఆశాజ్యోతి గా రాష్ట్రంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చిన గొప్ప వ్యక్తి అని అన్నారు. సుదీర్ఘ పాదయాత్రలో ఆయన ఇచ్చిన హామీలన్నింటినీ నవరత్నాలు రూపంలో నెరవేరిస్తూ దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు బీసీ వర్గాలకు అన్ని విధాల ఆదుకున్నారని అన్నారు. కార్పొరేషన్లు ఏర్పాటు చేసి తద్వారా వెనుకబడిన వర్గాలను ఆదుకునే విధంగా నిధులను మంజూరు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. రానున్న ఎన్నికలలో మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గెలిపించేందుకు వెనుకబడిన వర్గాలన్నీ ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. బిసి వర్గాలకు పార్లమెంట్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించే విధంగా బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. రాజకీయంగా బీసీ వర్గాలను ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మోసం చేస్తున్నారని ఆరోపించారు. అణగారిన వర్గాల వైపే మొగ్గు చూపడం దారుణం అన్నారు. బీసీలకు న్యాయం చేసిన రోజున అంబేద్కర్ లా మోడీ కూడా చిరస్థాయిగా నిలిచిపోతారని, స్వార్థ రాజకీయాలకు పోతే చరిత్ర హీనుడు అవుతారని అన్నారు. 2024లో జగన్మోహన్ రెడ్డికి ప్రజలు మరోసారి పట్టం కడతారని జోస్యం పలికారు. బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు వేముల బేబీ రాణి మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలను నిర్లక్ష్యం చేసిన ఘనత చంద్రబాబుకు దక్కిందని, ఆదుకుని అభ్యున్నతి వైపు నడిపిస్తున్న ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కిందని అన్నారు. అన్ని వర్గాలను ఆదుకుని సంక్షేమ సారథిగా, అభివృద్ధి వారధిగా ప్రజారంజక పాలన సాగిస్తున్నారని కొనియాడారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి 75 ఏళ్లు అయినా అణగారిన వర్గాల పట్ల గత ప్రభుత్వాలు చిన్నచూపు చూశాయని అన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి హయాంలో బీసీ వర్గాలకు సముచితస్థానం లభించిందన్నారు. త్వరలో జిల్లాలో రాజ్యసభ సభ్యులు, బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య పర్యటన నేపథ్యంలో బిసి గర్జనను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా బీసీ సంఘం మహిళా అధ్యక్షురాలు సుధా కృష్ణ, ఉపాధ్యక్షులు అప్పలకృష్ణ, ఉత్తరాంధ్ర బీసీ సంఘం ఇన్చార్జి గదుల సత్యలత, కన్వీనర్ బొద్దాన అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీ వత్తిడికి లొంగి మాకు అన్యాయం చేస్తారా..!

పోలీస్‌స్టేషన్ ఎదుట టీడీపీ నేతల ధర్నా

చింతాడ సంఘటనలో దోషులను శిక్షించాలని డిమాండ్

విశాలాంధ్ర-జామి: అధికార పార్టీ నేతల వత్తిడికి లొంగి మాకు అన్యాయం చేస్తారా..! తమకార్యకర్తలపై దాడులు చేస్తే చిన్న సెక్షన్లతో కేసులు నమోదు చేస్తారా.. ఇది మీకు తగునా..! అని మండల టీడీపీ నేతలు జామి పోలీసులను ప్రశ్నించారు. మండలంలోని చింతాడ గ్రామంలో ఇటీవల టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ నెలకొన్న విషయం తెలిసిందే. దీనికి సంభందించి గురువారం మండలంలోని టీడీపీ శ్రేణులంతా కలిసి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. తమ తెలుగుదేశంకు చెందిన స్థానిక నేత ద్వారపూడి బాలరాజుపైనా, అతని అన్నయ్య వెంకట రమణ, కుటుంబసభ్యులపైనా తీవ్ర స్థాయిలో వైసీపీ కార్యకర్తలు సర్పంచ్ ఆద్వర్యంలో దాడి చేసారన్నారు. ఆడవాళ్ళు అని చూడకుండా ఇంటిలోకి వచ్చి దాడి చేసారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని వాపోయారు. మండల పార్టీ అధ్యక్షులు లగుడు రవికుమార్, పోలిపర్తి స్వామినాయుడు, ప్రధాన కార్యదర్శులు వర్రి రమణ, దనియాల పైడిరాజు, మాజీ జెడ్‌పిటిసి బండారుపెదబాబుల ఆద్వర్యంలో నినాదాలు చేసారు. అధికార పార్టీ నేతల వత్తిడితో తమకేసును నీరుగార్చే విదంగా చేస్తున్నా రనే అనుమానాలు వ్యక్తం చేసారు. గ్రామంలో తెలుగు దేశం కార్యకర్తలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవించే పరిస్థితి నెలకొందన్నారు. వైసీపీ నేతలు రౌడీలు మాదిరిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఈకేసులో తమ కార్యకర్త కుటుంబానికి తగిన న్యాయం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో పారలమెంటరీ పార్టీ నాయకులు కొత్తలి సూర్యారావు, మాకిరెడ్డి శ్రీలక్ష్మీ, మండల నేతలు ఎన్నింటి అప్పలరాజు, రాయవరపు శ్రీను, గనివాడ ఎర్నాయుడు, బండారు జగన్నాధంతోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

ధర్నాకు సిపిఐ, జనసేన మద్దతు

తెలుగుదేశం పార్టీ నేతలు నిర్వహించిన ధర్నాకు మండలంలోని సిపిఐ, జనసేన నేతలు మద్దతుగా నిలిచారు. ప్రశాంతమైన మండలంలోని వైసీపీ నేతలు గూండాల్లా వ్యవహరించడం దారుణమని వారు ఆవేదన వ్యక్తం చేసారు. ధర్నాలో సిపిఐ తరుపన జిల్లా రైతుసంఘం ఉపాధ్యక్షుడు దేగల అప్పలరాజు, జనసేన నేతలు కెవిఆర్ వర్మ, దేగల ఈశ్వరరావు, గోవింద తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎస్ఐ వీరబాబుకు తమ వినతి పత్రాన్ని అందజేసారు.

వేపాడ-బక్కునాయుడుపేట రూట్లో బడి బస్సులు పునరుద్ధరించాలి

ఎస్.ఎఫ్.ఐ నాయకులు డిమాండ్

విశాలాంధ్ర-శృంగవరపుకోట : వేపాడ మండలం, బక్కున్నాయుడుపేట రూట్లో బడి బస్సులు తిప్పాలని కోరుతూ ఎస్.ఎఫ్.ఐ ఎస్.కోట మండల కమిటీ సభ్యులు ఎస్.కోట ఆర్టీసీ డిపో ఎస్టీఐ వెంకటరావును కలిసి సమస్యలపై గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష మాట్లాడుతూ విద్యా సంవత్సరం మొదలైన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తన బడ్జెట్ ని తగ్గించుకోవడానికి విద్యార్థులకు కేటాయించిన బడిబస్సుల సంఖ్యను తగ్గించాలని చూస్తుందని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బడి బస్సులు వెళ్లడం వల్ల కొంత మంది అయినా స్కూలుకి, కాలేజీకి వెళ్లి చదువుకుంటున్నారని స్పష్టం చేశారు. ఇప్పుడు విద్యార్థులు బస్సులు లేక ఆటోలకి రోజుకి 100 రూపాయలను ఇచ్చి బడికి వెళ్తున్నారని, ఆ బడి బస్సులను తిప్పకపోతే విద్యార్థులు ఎలా చదువుకుంటారని ప్రశ్నించారు. తక్షణమే వేపాడ, బక్కునాయుడుపేట, గొల్జాం, ముషిరాం, కొండగంగూబాడి బడి బస్సులను పునరుద్ధరించాలని, దీనితో పాటుగా విద్యార్థులు ఎక్కువ మంది గ్రామాల నుంచి వస్తారు కాబట్టి,గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందుబాటులో ఉండేది బస్సులే కావున,అందరి విద్యార్థులకు న్యాయం చేసేలా అన్ని రూట్లలో బస్సు పాసులు జారీ చేయాలని కోరారు. బడి బస్సుల విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని,బడి బస్సుల సంఖ్య కుదిస్తే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన డిసిఓ పద్మజ

విశాలాంధ్ర-వేపాడ: మండల కేంద్రం వేపాడ శివారు బక్కు నాయుడుపేటలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ అధికారి టి.పద్మజ ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా పిల్లలకు పెట్టే భోజన వసతుని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే విద్యార్థులు ఉపయోగించే బాత్రూములను పర్యవేక్షణ చేయడం జరిగింది. అదేవిధంగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి పరీక్షించారు.విద్యార్థులు శ్రద్ధగా చదివి పాఠశాలకు మంచి పేరు తీసుకుని రావాలన్నారు. అనంతరం పాఠశాల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి జిల్లా,మండల స్థాయిలో ఉత్తీర్ణతలు సాధించి, విద్యార్థులందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణతలు సాధించే విధంగా విద్యను అభ్యసించాలని, విద్యార్థులందరూ క్రమశిక్షణతో మెలిగేలా చూడాలని సిబ్బందికి తెలియజేశారు.ఈ పరిశీలనలో ఆమె వెంట పాఠశాల ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై రైతులకు వరి విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని సింగరాయి, పాటూరు, సచివాలయాల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో గురువారం ఆయా గ్రామాల సర్పంచుల చేతుల మీదగా రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ చేయడం జరిగింది. స్వర్ణ,సోనామసూరి, వంటి వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అగ్రికల్చర్ అసిస్టెంట్ కోమలి తెలిపారు.ఇరువురు సర్పంచులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగ పరుచుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య రథయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోళ్ల..

విశాలాంధ్ర-శృంగవరపుకోట: టీడీపీ అధిష్టానం చేపట్టిన భవిష్యత్ కు గ్యారెంటీ చైతన్య రథయాత్ర బస్సుయాత్రను పాయకరావుపేట టీడీపీ కార్యాలయం నుండి గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, బండారు సత్యనారాయణమూర్తి, కొండ్రు మురళి హాజరయ్యారు. పాయకరావుపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఇంచార్జి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో చేపట్టిన భవిష్యత్ కు గ్యారెంటీ బరోసా చైతన్య రథయాత్ర బస్సుయాత్రకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు బ్రహ్మరధం పట్టారు. ఈ చైతన్య రథయాత్రలో ఉత్తరాంధ్ర జోన్ 1 నియోజకవర్గాల టీడీపీ ఇంచార్జీలతో పాటు శృంగవరపుకోట నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి కోళ్ళ బాలాజీ అప్పల రాంప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష తో ప్రజలు కి మెరుగైన సేవలు

విశాలాంధ్ర-తెర్లాం/బాడంగి: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సచివాలయ కన్వీనర్లుకి మండల జేసీస్ కన్వీనర్ మరిపి శంకర్ అన్నారు. మండలంలో స్థానిక ఎంపీడీఓ ఆఫీస్ లో గురువారం సచివాలయం ద్వారా అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వార గ్రామ సచివాలయ పరిధిలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉద్దేశం అని , తరుచూ ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా స్పాట్‌లోనే సర్టిఫికేట్స్ ఇచ్చే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నెల రోజుల పాటు నిర్వహించబోతున్నారు. సచివాయల స్థాయిలోనే సమస్యలను పరిష్కరించి, ప్రతి పౌరుడి ముఖంలో చిరునవ్వు చూడడమే ప్రభుత్వ లక్ష్యం అని ఇదే విషయాన్ని ప్రజలోకి గట్టిగ తీసికొని వెళ్ళాలి అని అన్నారు.ఈ క్యాంపు ద్వారా ప్రతి పౌరుడి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయనుంది అని తెలిపారు.ఈ కార్యక్రమం లో ఎంపీపీ గౌరీ , జడ్పీటీసీ రామారావు, ఎంపీపీ ప్రతినిధి తెంటు మధు సూదన్ , ట్రైకర్ డైరెక్ట్ పారది చిన్నపు దొర, నాయకులు, సచివాలయం కన్వీనర్లు పాల్గొన్నారు.

సచివాలయాలలోనే రిజిస్ట్రేషన్లు

జగనన్న సురక్ష పథకంకు సిద్ధంకావాలి

విశాలాంధ్ర-పార్వతీపురం: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు కావలసిన అన్నిసేవలను అందించాలని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. గురువారం పార్వతీపురం మండలంలోని చిన్నబొండపల్లి సచివాలయాన్ని జిల్లా కలెక్టరు పరిశీలించారు. ప్రభుత్వం సచివాలయాల ద్వారా ప్రవేశపెట్టిన రిజిస్ట్రేషను విధానాన్ని తనిఖీ చేసారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మొదటి విడత రీసర్వే పూర్తయిన గ్రామాలలో రిజిస్ట్రేషన్లు జరపాలని తెలిపారు. సచివాలయంలో జరిగిన రిజిస్ట్రేషను గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. త్వరలో ప్రారంభిస్తున్న జగనన్న సురక్ష పథకం అమలుపై సిబ్బందికి అందించిన శిక్షణ గురించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు.జగనన్నసురక్ష పథకం ద్వారా ప్రతిఇంటిని సచివాలయ సిబ్బంది సందర్శించాలని, ప్రజల అవసరాలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమం ద్వారా ప్రజలకు కావలసిన వివిధ రకాల ధృవపత్రాలు జారీ, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాల అందజేయడం వంటివి విచారణ అనంతరం చర్యలు తీసుకొవాలన్నారు. సచివాలయంలో రికార్డులు, సేవల రిజిస్టర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, బయోమెట్రిక్ పరికరాల పనితీరును పరిశీలించారు. ఈకార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, రిజిస్ట్రేషను శాఖ అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష క్యాంపు కార్యక్రమాన్ని ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే అలజంగి జోగారావు

విశాలాంధ్ర-పార్వతీపురం: నియోజకవర్గంలో జగనన్న సురక్ష క్యాంపు కార్యక్రమాన్ని మూడు మండలాలు మరియు పురపాలక సంఘం ప్రజా ప్రతినిధులు చైర్ పర్సన్, వైస్ చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, పార్టీ అధ్యక్షులు, జేసిఎస్ కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు ప్రతీఒక్కరూ ప్రతీ సచివాలయం పరిధిలో తప్పక పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం పార్వతీపురం నియోజకవర్గం ఎమ్మెల్యే అలజంగి జోగారావు అధ్యక్షతన నియోజకవర్గ అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులతో పాటు కలిసి నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంప్ సమీక్షా సమావేశంలో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 23నుంచి "జగనన్న సురక్ష" క్యాంప్ అనే నూతన కార్యక్రమం ద్వారా గ్రామాల్లోకి పూర్తి స్థాయిలో ప్రభుత్వం మరియు పార్టీ యంత్రాంగాన్ని ప్రజల ఇంటి వద్దకు పంపించి 9అంశాలతో కూడిన ప్రభుత్వ పత్రాలను ఉచితంగా అందించేందుకు శ్రీకారం చుట్టారని తెలిపారు.కార్యక్రమంలో ప్రధానంగా కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, జనన ధ్రువీకరణ, మరణ ధ్రువీకరణ, కుటుంబ ధృవీకరణ, వివాహ ధ్రువీకరణ, లావాదేవి మ్యుటేషన్లు, ఫోన్ నెంబర్ కు ఆధార్ అనుసంధానం, పంట సాగు హక్కు కార్డు వంటి ముఖ్యమైన పత్రాలను నేరుగా ప్రజల ఇంటి వద్ద నూతనంగా రూపొందించిన యాప్ లో ప్రతిస్పందనలు నమోదు చేసుకొని వారి పత్రాలను సేకరించి టోకెన్ నెంబర్ ద్వారా వారి సమస్యను పరిష్కారం చేసేందుకు ఏర్పాట్లు చేశారు అని తెలిపారు. మన నియోజకవర్గం పరిధిలో నిర్వహించనున్న జగనన్న సురక్ష క్యాంప్ కార్యక్రమంలో 3 మండలాలు మరియు మున్సిపాలిటీ అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు చైర్ పర్సన్, వైస్ చైర్మన్లు, జెడ్పిటిసిలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, పార్టీ అధ్యక్షులు, జేసిఎస్ కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు తప్పక పాల్గొవాలన్నారు.